క్లుప్తంగా

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



క్రీడాకారులతో కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి టౌన్ : రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన తైక్వాండో క్రీడాకారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సోమవారం అభినందించారు. ఈ నెల 1, 2వ తేదీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి రైల్వే కాలనీలోని సరస్వతి శిశు విద్యామందిర్ ఇండోర్ హాల్లో నిర్వహించిన ఈ తైక్వాండో పోటీలలో రాయచోటి సింగర బ్రదర్స్ తైక్వాండో అకాడమీకి చెందిన ఐదు మంది ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. వీరిలో చుక్కా సాయికుమార్ బంగారు పథకం కె.రెడ్డయ్య వెండి పథకం, యు.సాయి కార్తిక్ వెండి పథకం, రెడ్డి మల్లేష్ రజతం, ఆర్.ఉజ్వల్ 5వ స్థానంలో నిలిచి పథకాలు సాధించారని సింగర బ్రదర్స్ సాంబశివ తెలిపారు.

అసాంఘిక శక్తులపై దృష్టి పెట్టండి



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌కమల్

సంబేపల్లె : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌కమల్ తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలవ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై దృష్టి పెట్టాలన్నారు. మండలంలో శాంతి భద్రతలపై తీసుకొంటున్న చర్యలపై ఆరా తీశారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కేసుల పురోగతిపై చర్చించారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు తీసుకొంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి పలు సలహాలు చేశారు.

అర్జీదారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న తబ్రేజ్‌ఖాన్

రాయచోటి అర్బన్ : అన్నదానం పుణ్యకార్యమని రాయచోటి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తబ్రేజ్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణంలో ప్రతి సోమవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్జీదారులకు నిర్వహించే అన్నదానం ఈ సోమవారం కూడా కొనసాగింది. వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ నేత హబీబ్‌ఖాన్ ఆర్థిక సౌజన్యంతో సోమవారం అర్జీదారులకు అన్నదానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు మహమ్మద్ హుస్సేన్, ఇస్లాం ఖాన్, ఖాజా, ముక్తధీర్, సమీర్‌లు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

రైల్వేకోడూరు : మండలంలోని ఉర్లగట్టుపోడు పంచాయతీలోని వైఎస్సార్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులను సోమవారం వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి పరిశీలించారు. రోడ్డు పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కాంట్రాక్టర్ డమ్ము రఘు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం తొలగింపుపై ఆర్డీఓకు ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థినీ

రాజంపేట : బోయనపల్లె మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్నటువంటి మంచినీటి చలివేంద్రాన్ని తొలగించడంపై సోమవారం ఇంటర్మీడియట్ విద్యార్థినీ వేలూరు రాశి రాజంపేట ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ఈ వినతిని సమర్పించారు. కాగా గతంలో రాశి తన పాకెట్ మనీతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. 365 రోజులు ఈ కార్యక్రమం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొంది.

బాధితులకు న్యాయం చేయండి

లక్కిరెడ్డిపల్లె : రోడ్డు విస్తరణ భూమి నష్టపోతున్న వారికి మార్కెట్ విలువను బట్టి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లిలో రాయచోటి-వేంపల్లె జాతీయ రహదారిలో ఇల్లు కోల్పోతున్న బాధితులతో వారు మాట్లాడారు. బాధితుల తరపున పోరాటం చేస్తామన్నారు. వారికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గమని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు రమణ, పెద్దన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- భక్తులతో పోటెత్తిన సాయినాథుని ఆలయాలు
- అన్నదానం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీలు



రాజంపేట: వ్యాసమహర్షికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పుల్లంపేట: పూజలు చేస్తున్న కొల్లం గంగిరెడ్డి, నాయకులు

రైల్వేకోడూర్ అర్బన్ : మండలంలోని పలు సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని సోమవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని టోల్ గేట్, కొత్త బస్టాండ్ వద్ద ఉన్న బాబా ఆలయంలో ఉదయం నుంచే దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు గ్రామోత్సవం నిర్వహించారు.

రాజంపేట టౌన్ : రాజంపేటలోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా బాబాను ప్రత్యేక పుష్పాలతో శోభామానంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. భక్తులు ఆలయాలకు తరలి వచ్చారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

సిద్దవటం : బెటాలియన్ ఎదురుగా ఉన్న షిర్డీసాయి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైఎస్‌ఆర్ సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్ రెడ్డి, బెటాలియన్ కమాండెంటు శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంటు ప్రభుకుమార్ హాజరై స్వామి వారికి పూజలు చేశారు.

పెనగలూరు : మండలంలోని సాయినాథుని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడి కనిపించింది. భక్తులు పాల్గొని పూజలు జరిపారు. సాయంత్రం పురవీధులలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ నిర్వహకులు పసుపులేటి రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని ఆలయాలలో జరిపిన గురుపౌర్ణమి వేడుకల్లో భక్తులు పాల్గన్నారు. ముఖ్యంగా దేవగుడిపల్లెలో వెలసిన కాళీ మాత మందిరంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చిట్వేలి : గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గరుగుపల్లి రోడ్డు మార్గంలో ఉన్న సాయిబాబా ఆలయంలో వేకువజాము నుంచి ఆలయాలలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పుల్లంపేట : మండలంలోని మల్లెంవారిపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



రామాపురం: భక్తులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి



రాజంపేట టౌన్: అలంకరణలో సాయిబాబా

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం వేదవ్యాస మహర్షి సందర్భంగా గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామాపురం : కేవలానంద లక్ష్మణార్యస్వామిజీ సన్నిధిలో సోమవారం ఘనంగా గురుపూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కేవలానంద లక్ష్మణార్య స్వామిజీ పంచామృత సహిత అభిషేకం, గురుపూజ నిర్వహించారు. సద్గురువులు, ఆశ్రమం పీఠాధిపతి స్వామి చిన్మామయ్య దంపతులను శిష్యులు, భక్తులు ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం వ్యాసపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ శిల్పి ఆనందాచారి అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లె వెంకటరమణ ఈ వేడుకలను నిర్వహించారు. నందలూరు మండల విద్యాశాఖాధికారులు నాగయ్య, అనంతకృష్ణ, లేబాక హెచ్‌ఎం శివరామప్రసాద్‌లతో కలిసి వ్యాస మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, జీవీరమణ, జీవీప్రసాదరావు, ఇందిర, గీత, రమణమ్మ, ఫిజికల్‌డైరెక్టరు గౌరీ, షాకీర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. అలానే అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు యొక్క ప్రభావం వారి వంద సంవత్సరాల సంస్కారమైన జీవితం ముడిపడివుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ అధికారి ప్రదీప్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన

పెద్దమండ్యం: ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు క్రై సంస్థ సహకారంతో జీవన నైపుణ్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెలిగల్లు, చెరువు కిందపల్లె గ్రామాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, సంరక్షకుల బాధ్యతల గురించి ఆటలు, పాటల రూపంలో వివరించారు. పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. పిల్లలకు యుక్త వయస్సులో వచ్చే మార్పులపై, బాలల హక్కుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. పిల్లల పెంపకంలో సమస్యలు, ఎవ్వరిని నొప్పించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్

మదనపల్లె : గ్రామ పంచాయతీ కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు డి.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీటీఎం రోడ్డులోని డీఎల్‌పీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు 2012 నుంచి ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ఆదేశాలు ఉన్నా ఎక్కడా అమలు చేయలేదన్నారు. గతంలో డీఎల్‌పీఓకి చాలాసార్లు నోటీసులు ఇచ్చినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు డీఎల్‌పీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు, వెంకటేష్, గోపాల్ పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



శాకాంబరి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీ ఊరేగారు. సోమవారం నిర్వహించే పల్లకీ సేవలలో భాగంగా వీరభద్రస్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి మాఢ వీధులలో ఊరేగించారు.

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భద్రకాళీ అమ్మవారిని శాకాంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గత అర్ధరాత్రి నుంచి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు జరిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బి.కొత్తకోట: వరుసగా నాలుగో ఏటా విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు చేసినందుకు ధన్యావాదాలు తెలుపుతూ సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చిత్రపటాలకు తల్లులు, వలంటీర్లు పాలాభిషేకం చేశారు. తమ ఖాతాలకు రూ.13వేలు జమ చేశారని హర్షం వ్యక్తం చేశారు. సీఎం, ఎమ్మెల్యేకు మద్దతుగా నినాదాలు చేశారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జీఓ నం. 1, 42లు వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఎస్ఎఫ్ఐ నేతలు విన్నవించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వారు కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా ఫీజు దోపిడీ, హాస్టళ్లు, పుస్తక విక్రయాలు, పాఠశాలల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం వంటివి చేస్తున్నట్టు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు చేపట్టలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో బీరం విద్యాసంస్థలో జరిగిన సంఘటన లాంటివి జరగకుండా ఉండాలంటే కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లె నరసింహ, రాయచోటి పట్టణనేతలు నరేష్, భానుప్రకాష్‌లు పాల్గొన్నారు.

మూడేళ్ల డిగ్రీ విధానాన్నే కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో మూడేళ్ల డిగ్రీ విద్యా విధానాన్నే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. నాలుగేళ్ళ డిగ్రీ వద్దు – మూడేళ్ల డిగ్రీ ముద్దు అంటూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండు సర్కిల్‌లో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో భాగంగా మూడేళ్ల డిగ్రీ కాల వ్యవధిని నాలుగేళ్లకు పెంచాలనుకోవడం తగదన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ల డిగ్రీ కాల వ్యవధి కోర్సును ప్రవేశపెట్టడాన్ని తమ సంఘం తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలంటూ ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి మాధవ్, రాయచోటి అధ్యక్ష, కార్యదర్శులు లోకేష్, ప్రశాంత్, నేతలు మారయ్య, బాలసుబ్రమణ్యం, వినయ్, అబిద్, వెంకట్ కుమార్, గిరిబాబు, బయన్నతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని నిరసన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటలో సోమవారం గ్రామస్థులు, విద్యార్థులు ఆర్టీసీ బస్సును అడ్డుకున్నారు. గతంలో ఈ రూట్‌లో రెండు బస్సులు నడిచేవని గ్రామస్తులు తెలిపారు. గత ఎనిమిది నెలల ఒక్క బస్సు మాత్రమే నడుస్తుండటంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు సకాలంలో గమ్యం చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ లోకేష్, ఎంపీటీసీ రవి కుమార్ ప్రజా అవసరాలను గుర్తించి మదనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో సమస్యను వివరించారు. రెండు రోజుల్లో అదనపు బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని డీఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గించవద్దు



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగప్రసాద్

సిద్దవటం : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని భాకరాపేటలో సోమవారం సాయంత్రం గ్రామ సభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు గ్రామ సభను నిర్వహించామని, గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఘర్షణలకు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జీవితాలు నాశనం అవుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రానాయక్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు



రఘునాథరాజు



కోదండనాయుడు

రాజంపేట టౌన్ : మండల విద్యాశాఖ అధికారిగా రఘునాథరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన చదువును అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సమయం విధిగా పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. విద్యార్థుల ప్రగతిని ప్రతి నెల బేరీజు వేసుకోని బోధన పద్ధతులను మార్చుకోవాలన్నారు.

చిట్వేలి : మండల విద్యాశాఖ అధికారిగా ఎ.కోదండ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కర్నూలు జిల్లా ఆలూరులో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంఈఓగా నియమితులయ్యారు. చిట్వేలి ఎంఈఓగా పనిచేస్తున్న మహేశ్వరరావు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాశాఖలో స్థితిగతులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని అభివృద్ధి చేస్తానని తెలిపారు.

మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలి

వైవీయూ: మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు బాలవీరారెడ్డి కోరారు. సోమ వారం కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లోని 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌లో కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి క్యాంటీన్ కోసం వచ్చే మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు తగిన వసతి కల్పించడంతో పాటు, సరుకులు కూడా అన్ని రోజులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల బంద్‌ను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని నిరసిస్తూ తమ సంఘం రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న ప్రైవేట్ పాఠశాలల బంద్‌ను జయప్రదం ఏబీవీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జె.పి.నాగిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాండ్ పేరుతో కార్పొరేట్ విద్యా వ్యాపారం జోరుగా సాగుతోందన్నారు. వివిధ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏబీవీపీ నగరఅధ్యక్షుడు నందకిషోర్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నేతలు హరిప్రసాద్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్‌ను చేపడుతున్నట్లు ఆ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజాద్ తెలిపారు. ఈ సందర్భంగా బంద్ పోస్టర్లను మంగళవారం ఆయన ఇక్కడ విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాలల బంద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేయడమే కాక విద్యాసంస్థల్లోనే పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, పెన్నులు, చివరికి షూ, సాక్స్‌లు వంటివి స్కూల్‌లోనే కొనాలని ఆంక్షలు పెట్టి విద్యను వ్యాపారం చేశారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు పద్మావతి, శ్వేత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలలో కొమ్మ కత్తిరింపులు తప్పనిసరి



పెనగలూరు: కట్టావారిపల్లిలో కొమ్మకత్తిరింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనగలూరు/రామాపురం : మామిడి తోటలలో కొమ్మకత్తిరింపులు రైతులు తప్పనిసరిగా చేపట్టాలని అయా మండలాల ఉద్యానశాఖ అధికారులు సురేష్ బాబు, నాగమణి తెలిపారు. సోమవారం పెనగలూరు మండలం కట్టావారిపల్లి పంచాయతీ, రామాపురం మండలం బండ్లపల్లె పంచాయతీ వెంకటరెడ్డి గారిపల్లె గ్రామాల రైతులకు మామిడి తోటల రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి కాయలు కోసిన తరువాత 15 నుంచి 20 రోజులు విశ్రాంతి ఇచ్చి ఆ తరువాత కొమ్మలు కత్తిరించాలన్నారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి, వెలుతురు చెట్లలోనికి ప్రసరించేలా కొమ్మలు కత్తిరించాలన్నారు. తూర్పు, పడమర వైపున ఉన్న కొమ్మలను, ఎండు పుల్లలను కత్తిరిస్తే సూర్యరశ్మి బాగా తగులుతుందన్నారు. రైతులు జూలై నెలలో కత్తిరింపులు కచ్చితంగా చేయాలన్నారు. పంట పూత పిందె దశలో తెగుళ్ల, పురుగుల ఉధృతి తగ్గి కొమ్మ కత్తిరింపుల వలన పంట దిగుబడి పెరుగుతుందన్నారు. పలు అంశాలపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, లేనిపక్షంలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, నగర కార్యదర్శి డీఎం ఓబులేశు, ఏపీ ఉద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ సిద్దిఖ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. గతేడాది పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 6100 కానిస్టేబుల్, 411 ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఈ ఏడాది జనవరి 22వ తేది ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించారన్నారు. కానీ ఇప్పటివరకు ఫిజి కల్ ఈవెంట్స్ నిర్వహించలేదని తెలిపారు. న్యాయ, సాంకేతిక సమస్యలేమైనా ఉంటే ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, డీవైఎఫ్ఐ నాయకులు నరసింహులు, విజయ్, యూసుఫ్, సురేంద్ర, రాజేంద్ర, సురేష్ పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు.

ఫ్యాప్టో సదస్సును విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) చేపట్టిన పోరాట కార్యక్రమంలో భాగంగా 9వ తేదీ కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం కడపలోని సీఎస్ఐ స్కూల్ ఆవరణలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో సన్నాహక సభ నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజులతోపాటు పలు ఉపాధ్యాయ సంఘ నేతలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు, గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మదనపల్లె వెటర్నటీ ప్రాంతీయ వైద్యశాలలో ఉచితంగా అందించే రేబీస్ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ రోహిణి తెలిపారు. టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

జగనన్న సురక్షతో సంక్షేమం సంపూర్ణం



ఓబులవారిపల్లె: సర్టిఫికెట్లు ఇస్తున్న సాయికిషోర్ రెడ్డి



రైల్వేకోడూరు: ధృవీకరణ పత్రం ఇస్తున్న వైస్ ఎంపీపీ

రైల్వేకోడూరు : జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలు సమస్యలు పరిష్కారం అవుతాయని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రాఘవరాజుపురం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు అవసరమున్న సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమం

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి, కొత్తపల్లె, మల్లూరు గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనర్ దివాకర్‌నాయక్ మాట్లాడుతూ వాలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు అందజేసేలా కృషి చేయాలన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, సర్పంచులు ముసల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, నజీర్‌బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్టు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దఓరంపాడు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వారన్నారు. గ్రామంలోని 250 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, పి.రామిరెడ్డి, సర్పంచ్‌లు ఈశ్వరయ్య, జరుగు నారాయణరెడ్డి, పోలి పాపిరెడ్డి, ఏపీఎం ఆర్ముగం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కుల ధృవీకరణ పత్రాలు 185, రైస్ కార్డులు 18 లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. దీంతో లబ్ధిదారులు మాట్లాడుతూ టీడీపీ హయాంలో కుల ధృవీకరణ పత్రాలు పొందాలంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగన్ ప్రభుత్వంలో ఉచితంగా కుల ధృవీకరణ పత్రాలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, ప్రకాశం, సర్పంచ్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.